www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 డిసెంబరు 2022
5
పశ్చిమ గోదావరి



ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : సిపిఎం

భీమవరం :తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణంలో మార్పులు వేగంగా మారడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, ధాన్యం మాసూళ్ల మధ్యలో ఉన్నాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు మాత్రం చాలా మందకొడిగా సాగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు పండించిన పంటను వేగంగా అమ్ముకునేందుకు వీలులేదన్నారు. వాతావరణం మారిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగి కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రతీ రైతుకు అందేలా చూడాలన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని, అవసరమైన సంచులను అందుబాటులో ఉంచాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మొత్తం రైతాంగాన్ని ఆదుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతుల ఆందోళనను అర్థం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని, ఒకటి రెండు రోజుల్లో సాధ్యమైనంత మేరకు ధాన్యం కొనుగోళ్లు చేయాలని కోరారు.

కొన్నది సగం ధాన్యమే..!

రెండు జిల్లాల్లో దిగుబడులకు, కొనుగోలు లక్ష్యాలకు పొంతన కరువు

లక్ష్యం పూర్తయిందని కొన్ని మండలాలకు సంచులు నిలిపివేత

మండలాల్లో అధికారులను నిలదీస్తున్న రైతులు

మరోపక్క తుపాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు

ధాన్యం కొనేందుకు ముందుకు రాని మిల్లర్లు, వ్యాపారులు

కొనసాగుతున్న లారీల సమస్య



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ధాన్యం నూతన కొనుగోలు విధానంలో మిల్లర్లు, ధాన్యం వ్యాపారుల ప్రమేయం లేకుండా చేశాం. రైతులకు మేలు చేసేలా అన్ని చర్యలూ తీసుకున్నాం. ఇ-క్రాప్ పూర్తయిన ప్రతి ఎకరా ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని నిన్నటి వరకూ ఊదరగొట్టారు. ఇప్పుడేమో నిర్దేశించిన లక్ష్యం వరకూ మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని, బహిరంగ మార్కెట్లో అమ్ముకోవాలని చెబుతున్న పరిస్థితి నెలకొంది. 'మీకిచ్చిన లక్ష్యం పూర్తయిందని, ఇక సంచులు ఇచ్చేది లేదని మండలాల్లోని అధికారులకు చెప్పడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లాలవ్యాప్తంగా వచ్చే వరి దిగుబడులకు.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి ఏమాత్రం పొంతన లేదని స్పష్టమవుతోంది. ఒకపక్క వాతావరణ మార్పులు, మరోపక్క ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 1.99 లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. ఐదు లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే ఇక్కడ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్దేశించుకున్న ధాన్యం లక్ష్యం 3.42 లక్షల టన్నులు మాత్రమే. ఏలూరు జిల్లాలో రెండు లక్షలకుపైగా ఎకరాల్లో వరిసాగు సాగింది. ఇక్కడ కూడా దాదాపు ఆరు లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి తీసుకున్న లక్ష్యం మాత్రం 3.80 లక్షల టన్నులు మాత్రమే. దీన్నిబట్టి చూస్తే పండిన పంటలో సగం ధాన్యం మాత్రమే కొనుగోలు చేసేలా లక్ష్యాలు కన్పిస్తున్నాయి. మిగిలిన ధాన్యం కొనుగోలు పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు మాత్రం సరైన సమాధానం లేకుండాపోయింది. ఇప్పటికే ఇచ్చిన లక్ష్యానికి సరిపడా ధాన్యం కొనుగోలు చేశారని, ఇక సంచులు ఇవ్వడం కుదరదని పలు మండలాలకు చెబుతున్నట్లు తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయాలని మండలాల్లోని అధికారులను రైతులు చుట్టుముడుతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మిల్లర్లు, వ్యాపారుల ప్రమేయం లేకుండా చేస్తానని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడేమో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం ఏమిటని అంతా తలలు పట్టుకుంటున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు రైతులను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. ధాన్యం అమ్మకానికి వెళ్తే వ్యాపారులు, మిల్లర్లు ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్న పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. చాలాచోట్ల ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు, వ్యాపారులు సైతం ముందుకు రాకపోవడంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని దుస్థితి నెలకొంది. మరోపక్క బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. అందుకు తగినట్లుగా వాతావరణంలో సైతం పెను మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరోపక్క లక్ష్యం ప్రకారమే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులకు ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

తీరని లారీల సమస్య

ధాన్యం తరలింపునకు సంబంధించి లారీల సమస్య మాత్రం ఏలూరు జిల్లాలో రైతులను ఇంకా వెంటాడుతూనే ఉంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో వాహనాలు రావడం లేదు. ఆయా మండలాలకు రోజుకు 20 లారీలు అవసరముంటే కేవలం ఏడెనిమిది లారీలు మాత్రమే వస్తున్నాయి. దీంతో ధాన్యం తరలింపు మందకొడిగా సాగుతోంది. ధాన్యం కల్లాలోనే ఉండిపోవడంతో వాతావరణ హెచ్చరికలు రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. లారీలు అధిక సంఖ్యలో వెళ్తే బస్తాల్లో పట్టిన ధాన్యం త్వరితగతిన పూర్తవుతోంది. చాలామంది రైతులు బస్తాలో ధాన్యం పట్టి ఐదురోజులపైనే ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.



ఎర్రని తోరణాలతో ముస్తాబైన జంగారెడ్డిగూడెం పట్టణం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు

సర్వం సన్నద్ధం

నేడు భారీ ప్రదర్శన, బహిరంగ సభ

పాల్గొనున్న గిరిజనోద్యమ నేత బృందాకరత్, జాతీయ నేతలు

మండల, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



జంగారెడ్డిగూడెంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభకు ఏజెన్సీ ముఖద్వారమైన జంగారెడ్డిగూడెంలో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ మహాసభకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు మహాసభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం వివిధ రూపాల్లో నిర్వహించామన్నారు. తొలిరోజు నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభల్లో వేలాది మంది వ్యవసాయ కార్మికులు, పేదలు, గిరిజనులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం రెండు రోజులపాటు జరిగే ప్రతినిధుల సభకు 350 మంది ప్రతినిధులు, 50 మంది ఆహ్వానితులు మొత్తం 400 మంది హాజరుకానున్నారని చెప్పారు. బహిరంగ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు ఎ.విజయరాఘవన్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, కేరళ ఎంపీ శివదావన్, రైతుసంఘం మాజీరాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొంటారని వివరించారు.

వ్యవసాయ కార్మికసంఘం నేత రామబ్రహ్మం మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు



వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నేత కొత్తలంక రామబ్రహ్మం(95) బుధవారం ఆయన స్వగ్రామం కాపవరంలో వయోభారంతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన మృతికి సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు సంతాపం తెలిపారు. జిల్లాలో వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశారని, ఆయన మృతి కార్మిక సంఘానికి తీరనిలోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. పార్టీ పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల కార్యదర్శులు బి.బలరాం, ఎ.రవి ప్రగాఢ సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నేతలు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, పురుషోత్తం, చల్లా సోమేశ్వరరావు, అజయ్, వలవల శ్రీరామ్మూర్తి మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి అంజలి ఘటించారు.

మహిళా సంఘం సంతాపం

రామబ్రహ్మం మృతికి పట్టణ మహిళా సంఘం భవనంలో బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఆయన వ్యవసాయ కార్మికుల కోసం చేసిన సేవలు, పార్టీ సంక్షోభ సమయంలో ఇన్‌ఫార్మర్‌గా చేసిన సేవలను కొనియాడారు. ఈ సభలో ఐద్వా నేతలు బి.రోజామణి, సీతారత్నం, దోర రత్నం, జె.లక్ష్మి, బాసిన శ్యామల పాల్గొన్నారు.

'జగనన్న పాల వెల్లువ' పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్

భీమవరం :జగనన్న పాలవెల్లువ రెండో విడత ప్రారంభానికి సంబంధించిన పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడతలో నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి మండలాల్లోని 25 గ్రామాల్లో పాలసేకరణకు ప్రణాళిక రూపొందించాలన్నారు. రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు. ఎఎంసి సిబ్బందికి, ప్రమోటర్లకు, సెక్రెటరీ, అసిస్టెంట్ సెక్రటరీలకు శిక్షణ పూర్తి చేయాలన్నారు. బిఎంసియులో మిషన్లు ఏర్పాటు చేసి కాలిబ్రేషన్ చేయడంతో పాటు సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బిఎంసియులకు రెండు భవనాలు గుర్తించాలని ఆదేశించారు. ఈ నెల 11వ తేదీన నరసాపురం మండలంలో బిఎంసియులో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ, డిసిఒ ఎం.రవికుమార్, డిపిఒ ఎం.నాగలత, మార్కెటింగ్ శాఖ అధికారులు, ల్యాండ్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును విరమించుకోవాలి

భీమవరం: ఉపాధ్యాయులు అనేక సమస్యల్లో ఉన్నారని, దీనికితోడు పాఠశాల విద్యా కమిషన్ ఆదేశాలతో పని సర్దుబాటు చేస్తున్నారని, దీన్ని తక్షణం నిలుపుదల చేసి బదిలీలు చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాల విద్య, ఉపాధ్యాయుల పని సర్దుబాటును, 117కి సవరణ జిఒ 128 ఆధారంగా చేపట్టాలని కోరుతూ బుధవారం నిరసన తెలిపారు. అనంతరం డిఇఒ కార్యాలయ ఎడి నాంచారయ్యకు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటును వ్యతిరేకించారు.

కలెక్టరేట్‌లో రెండు బ్యాంకులు ప్రారంభం

భీమవరం :భీమవరం కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌లను కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి దాసి రాజు, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.రంగరాజన్, రీజనల్ మేనేజర్ ఇ.వెంకటేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ కాశీ విశ్వనాథం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం, రీజనల్ హెడ్ ఎంఎస్.రామారావు, డిప్యూటీ రీజనల్ హెడ్ టి.శ్రీరామచంద్రమూర్తి, ఎల్‌డిఎం వెంకట రమణ, , బ్రాంచ్ మేనేజర్ రామిరెడ్డి, సందీప్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

వచ్చేనెల 2,3,4 తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) కోరారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు(ఐవి) మాట్లాడుతూ నేడు దేశంలో అమలు చేస్తున్న పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను, ప్రభుత్వాలను ప్రశ్నించడంలో ముందున్న సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు నాయకులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడేందుకు కార్మిక సంఘాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి, సిఐటియు జిల్లా కమిటీ కౌన్సిల్ సభ్యులు వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు గార రంగారావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల తొలగింపు దారుణం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పారిశుధ్య కార్మికుల తొలగింపును విరమించుకోవాలని సిఐటియు జిల్లా ఉపా అధ్యక్షులు సూర్నీడు వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు యూనిఫారాలు, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. టెండర్ విధానం రద్దు చేయాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న బంగారు అప్పారావును విధుల నుంచి తొలగించడం అన్యాయమని, తక్షణం ఆ కార్మికుణ్ని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రత్యేక అధికారి ఎఎస్‌ఎ.రామస్వామికి, ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.ప్రసాద్, నేతలు వి.కిషోర్, బి.అప్పారావు, బి.లక్ష్మమ్మ, డి.నాగరాజు, బి.చిన్నారావు, బి.విజయ పాల్గొన్నారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ ఈ ధర్నాకు సంఘీభావం తెలిపారు.

బిసిలను విస్మరించిన వైసిపి :తోట

భీమవరం రూరల్ :బిసిలను కులాలుగా విభజించి వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఛైర్మన్ పదవులు కట్టబెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాళ్ల కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకుండా చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి విమర్శించారు. టిడిపి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద 'బిసిలకు ఇదేం ఖర్మ' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తిరుమల కాలేజీ వద్దనుండి టిడిపి నాయకులు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ఐదుగురు మాత్రమే వెళ్లాలని కోరారు. అయితే తాము శాంతియుతంగా ర్యాలీ చేస్తున్నామని, వినతిపత్రం ఇచ్చి బిసిల సమస్యను కలెక్టర్‌కు వివరిస్తామని, అందరినీ అనుమతించాలని కోరడంతో పోలీసులు నిరాకరించారు. వారంతా పోలీసులను దాటుకుని కలెక్టర్ కాంపౌండ్ వద్దకు చేరుకున్నారు. సిఐ అడబాల శ్రీనివాస్ మాట్లాడుతూ పది మందిని మాత్రమే అనుమతించారు. అనంతరం ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి), రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్, అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాడ రవి, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేని రోజారమణి మాట్లాడారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని వెలివెల గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోడి విజయ భాస్కర్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు కోటి రాంబాబు, బిసి సెల్ అధ్యక్షులు డి.ఏసు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పాలకోడేరు సిద్ధం

నేటి నుంచి నుంచి నాలుగు రోజులపాటు పోటీలు

రాష్ట్రవ్యాప్తంగా 450 మంది క్రీడాకారులు రాక

నేడు ప్రముఖులచే పోటీల ప్రారంభోత్సవం

క్రీడలకు ఏర్పాట్లు పూర్తి: ఆర్గనైజింగ్ అసిస్టెంట్ కార్యదర్శి పవన్ కుమార్‌రాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు గ్రామం వాలీబాల్‌కు పుట్టినిల్లు. ఈ గ్రామంలో వాలీబాల్ నేర్చుకని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి పాలకోడేరు గ్రామ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేశారు. దీనికి ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు, కీర్తిశేషులు జి.నారాయణరాజు చేసిన కృషి ఎనలేనిది. వాలీబాల్ క్రీడాకారులకు ఆయన అందించిన సేవల ఫలితంగా పలువురు క్రీడాకారులు వివిధ రంగాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో నారాయణరాజు జ్ఞాపకార్థం జిల్లా వాలీబాల్ అసోసియేషన్, పాలకోడేరు జిఎన్‌ఆర్, ఎస్‌ఎసి అండ్ ఎఎస్‌ఆర్ క్లబ్, పాలకోడేరు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏడో రాష్ట్రస్థాయి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నారు. పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంను పోటీలకు సిద్ధం చేశారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఈ క్రీడలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 13 మహిళ, 13 పురుష జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 450 మంది క్రీడాకారులతోపాటు మరో 150 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు పోటీల్లో భాగస్వాములు కానున్నారు.

పోటీలకు సర్వం సిద్ధం

రాష్ట్రస్థాయి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఈ ఏడాది పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో మండల, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం సర్వసాధారణం. రాష్ట్రస్థాయిలో ఛాంపియన్‌షిప్ నిర్వహించడం అనేది సామాన్య విషయం కాదు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్, జిఎన్‌ఆర్, ఎస్‌ఎసి అండ్ ఎఎస్‌ఆర్ క్లబ్ సంయుక్తంగా ఈ పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ప్రముఖ క్రీడాకారుడు నారాయణరాజు కుమారుడు పవన్‌కుమార్‌రాజు ఈ పోటీలకు ఆర్గనైజింగ్ అసిస్టెంట్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పోటీలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. గత పది రోజుల నుంచి వాలీబాల్ పోటీలకు వీలుగా క్రీడాప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. క్రీడాకారులు డే అండ్ నైట్ బ్యాచ్‌లు ఆడేందుకు ఫ్లడ్ లైట్ ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణం మొత్తం విద్యుత్ కాంతులు ఏర్పాటు చేశారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా గ్రామాన్ని మొత్తం ఈ పోటీల నేపథ్యంలో సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, క్రీడాకారులు పాలకోడేరు గ్రామం వస్తున్న ఈ నేపథ్యంలో గ్రామంలో కోలహాలం నెలకొంది.



నేడే ప్రారంభోత్సవం

పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పోటీలను అంతే ప్రతిష్టాత్మకంగా ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేశారు. ప్రముఖుల ఆధ్వర్యంలో ఈ పోటీలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా, కలెక్టర్ పి.ప్రశాంతితోపాటు పలువురు ఎంఎల్‌ఎలు హాజరు కానున్నారు.

ఏర్పాట్లన్నీ పూర్తి


క్రీడల ఆర్గనైజింగ్ అసిస్టెంట్ కార్యదర్శి పవన్ కుమార్‌రాజు

నాలుగు రోజులపాటు నిర్వహించబోయే రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు క్రీడల ఆర్గనైజింగ్ అసిస్టెంట్ కార్యదర్శి పవన్‌కుమార్‌రాజు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడలను వీక్షించేందుకు వీలుగా క్రీడామైదానాలను ప్రత్యేకంగా తీర్చిదిద్ది ఎవరికీ ఎటువంటి ఇబ్బందీ లేనివిధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

నాటి నుంచి నేటి వరకూ

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

భూపోరాటాలు, కూలి, ఉపాధి ఉద్యమాలకు వేదికగా వ్యవసాయ కార్మిక సంఘం





వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిన నాటినుండి కూలి, భూమి, ఇళ్ల స్థలాల సమస్యలపై సుందరయ్య స్థాపించిన సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పేదలకు పంచాల్సిన 16 రకాల ప్రభుత్వ భూములపై పెద్దఎత్తున ఉద్యమాలు నడిచాయి. పేదల పక్షాన కార్మికుల హక్కుల కోసం కూలి పోరాటాల నిర్మాణంలో వ్యవసాయ కార్మిక సంఘం కృషి ఎనలేనిది. ఇళ్ల స్థలాల కోసం, కూలి పోరాటాల సందర్భంగా అనేకమంది కూలీలు, పేదలు జైలుకు వెళ్లిన సందర్భాలూ ఈ జిల్లాలో ఉన్నాయి. వ్యవసాయ కార్మిక సంఘం ప్రారంభం నాటి నుండి నేటికీ అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ జిల్లాలో 50 వేల సభ్యత్వాన్ని పూర్తిచేసుకుని నేడు 29వ రాష్ట్ర మహాసభ నిర్వహణకు వేదికైంది. ఇప్పటికే జంగారెడ్డిగూడెం పట్టణం ముస్తాబైంది. భూపోరాటాల గడ్డ, ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరాటపటిమ చూపిన జంగారెడ్డిగూడెం నేడు వ్యవసాయ కూలీల సభకు సిద్ధమైంది.

ఇప్పటికే సంఘం ఆధ్వర్యాన జిల్లాలో భూమి, కూలి, ఉపాధి, సామాజిక అంశాలపై ఉద్యమాలు సాగుతున్నాయి. షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న పోలవరం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో ఎల్‌టిఆర్ భూముల కోసం గత 25 ఏళ్లుగా ఎత్తిన జెండా దించకుండా ఎర్రజెండా ఆధ్వర్యంలో భూపోరాటాలను సాగిస్తోంది. 20 వేల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర వ్యవసాయ కార్మిక సంఘానికి ఉంది. టి.నర్సాపురం మండలంలో పోడు భూముల కోసం సంఘం పోరాడుతుంది. ఆదివాసీ బిడ్డలను చైతన్యపర్చి, సమీకరించి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో భూమి కోసం పోరాడుతుంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో వందల ఎకరాల భూముల్లో పోడు కొట్టి ఆదివాసీ బిడ్డలు వ్యవసాయం సాగిస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో గత 15 ఏళ్ల నుండి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై ఆందోళన, ఉద్యమాలను సాగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టేందుకు కృషి చేస్తోంది. జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో ఎర్రకాల్వ రిజర్వాయర్ మిగులు భూములు 3500 ఎకరాలను పేదలకు పంచాలని పెద్దఎత్తున ఆందోళన పోరాటాలను ఐదేళ్ల నుండి సంఘం ఆధ్వర్యంలో సాగిస్తోంది. ఈ జిల్లాలో రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాల నిర్మాతలైన ఉద్దరాజు రామం, అన్నే వెంకటేశ్వరరావు, అన్నే అనసూయమ్మ స్ఫూర్తితో ఈ మహాసభ నిర్వహించబోతున్నాం. సీలింగ్ భూముల కోసం దెందులూరు తదితర మండలాల్లో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నాం. ఇళ్ల స్థలాల సమస్యపై పెదవేగి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పోరాటం చేసి వందలాది కుటుంబాలకు గుడిసెలు వేయించిన చరిత్ర వ్యవసాయ కార్మికసంఘానికి ఉంది. కూలీ పోరాటాల్లో భూస్వాములకు వ్యతిరేకంగా కూలీలందరినీ ఐక్యం చేసి సుదీర్ఘకాలం పోరాటాలు నడిపిన జంగారెడ్డిగూడెం, పెదవేగి, తాళ్లపూడి తదితర మండలాల్లో సామాజిక ఉద్యమాలను కూడా ముందుకు తీసుకెళ్తోంది. 12 మండలాల్లో పామాయిల్ కార్మికుల సమస్యలపై పోరాడుతూ వారి హక్కుల కోసం ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరుతూ జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు నిర్విరామంగా పోరాడుతున్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘం. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను కుంజా బుజ్జి, సున్నం రాజయ్య తదితరులు స్ఫూర్తితో జంగారెడ్డిగూడెం పట్టణంలో నిర్వహించబోతున్నాం.

-ఎ.రవి, రాష్ట్ర కార్యదర్శి
ఎపి వ్యవసాయ కార్మిక సంఘం


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ప్రసాదరాజు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే గడపగడపకూ మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం పాతపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రసాదరాజు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొప్పాడి లక్ష్మీ తులసి ఉమామహేశ్వరరావు, రామని ఉమా పలువురు నాయకులు ఉన్నారు.

బాలికలకు రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి - నరసాపురం

బాలికలకు అన్ని విధాలా రక్షణ కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పోగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో గౌతమీ కాలేజీలో బాలికలకు బుధవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పోగాకు పూర్ణ మాట్లాడుతూ ఆడపిల్లలు ఇంట బయట వేధింపులకు గురవుతున్నారన్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు పిల్లలు చిన్నవయస్సులోనే శ్రామికులుగా మారిపోతున్నారన్నారు. కుటుంబ పరంగానే 89 శాతం మంది పిల్లలు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. 53.22 శాతం బాలబాలికలు ఒకటి లేదా పలు రకాలైన అత్యాచారాలకు గురవుతున్నట్లు ఓ అధ్యయనంలో వెల్లడైందని తెలిపారు. చట్టాలు కఠినంగా అమలు చేయాలని, బాలికలకు అన్ని విధాల రక్షణ కల్పించాలని ఆమె కోరారు. ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ మాట్లాడుతూ అమ్మాయిలు తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలతో మెలగాలని కోరారు. సెకండ్ ఇయర్ విద్యార్థిని ప్రత్యూష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిన బిసి నేతలు

ప్రజాశక్తి - ఆచంట

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి జగన్ అని బిసి మహాసభ మండల ఇన్‌ఛార్జి పెచ్చెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం విజయవాడలో జరగనున్న బిసి మహాసభ కు మండలం నుండి బిసి నేతలు, కార్యకర్తలు 10 బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న చేదోడు కింద బిసి కులవృత్తుల్లో ఉన్నవారికి రూ.10 వేలు చొప్పున నేరుగా వారు అకౌంట్లో జమ చేస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జక్కంశెట్టి చంటి, మొల్లేటి రామకృష్ణ, గుడాల శ్రీనివాస్, కె.సత్యనారాయణ, మొల్లేటి రాంబాబు, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

ఉండి : విజయవాడలో జరిగే జయహో బిసి మహాసభకు బుధవారం ఉండి నుండి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో సుమారు 200 మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ టిడిపి బిసిలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందన్నారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సురవరపు వెంకటాచార్యులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలోనే బిసిలకు తగు న్యాయం జరుగుతుందన్నారు. విజయవాడ వెళ్లిన వారిలో రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, రణస్థల మహంకాళి, ధనుంజయ, కరిమెరక మల్లికార్జున, గిరడా శ్రీను ఉన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, విఎఒలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రతి గ్రామంలో సీసీ, గ్రావెల్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ఇజిఎస్ నిధులను పెద్ద ఎత్తున మంజూరు చేశారన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రామచంద్రప్రభు, సర్పంచులు, ఎంపిటిసిలు, విఆర్ఒలు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో రాజ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న యడ్ల తాతాజీ

తాతాజీ దాతృత్వం

రాజ్‌కుమార్ కాలు సర్జరీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రమాదానికి గురై కాలు విరిగిన వ్యక్తికి డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ ఆపరేషన్ చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో పెదపేటకు చెందిన కొక్కిరి రాజ్‌కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో సర్జరీ చేయాలని, రూ.లక్ష ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకోవాలనుకుంటే ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులో పేరు తప్పుగా ఉండడంతో ఆరోగ్యశ్రీ వర్తించదని వైద్యులు తెలిపారు. దీంతో రాకుమార్ ఇంట్లోనే ఉన్నాడు. అయితే అతని తల్లిదండ్రులు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీని కలిసి తమ బిడ్డకు సర్జరీ చేయించాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తాతాజీ ఆరోగ్యశ్రీ ద్వారా బుధవారం సర్జరీకి ఏర్పాట్లు చేశారు. గురువారం బాధితునికి సర్జరీ జరగనుంది. దీంతో బాధితులు యడ్ల తాతాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంబా సునీల్, చోడగిరి బాలాజీ, చెన్ను విజయ్, గంటా నరేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, పాలపర్తి కృపనాథ్, వాకాడ అశోక్ వర్మ, పిల్లా అప్పాజీ పాల్గొన్నారు.

గూడెంలో ఎఆర్‌టి రూప్ గ్రూప్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక గుడ్‌ల్యాంప్ ఆర్గనైజేషన్ వద్ద కెపిపిఎల్ హెచ్ఐవి మందులను ఉచితంగా ఇచ్చే కమ్యూనిటీ ఎఆర్‌టి రూప్ గ్రూప్ సెంటర్‌ను రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిప్యూటీ డాక్టర్ ఎఇ ఫ్లోరెన్స్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కెపిపిఎల్ హెచ్ఐవి వారికి సక్రమంగా మందులు అందేలా, హెచ్ఐవి వైరల్ లోడును తగ్గే విధంగా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏరియా ఆసుపత్రి ఎఆర్‌టి సెంటర్ డాక్టర్ శివప్రసాద్, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శ్యాంసన్, డిఐసి హరినాథ్, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ జగదీష్, టిఐ ప్రాజెక్ట్ మేనేజర్ బి.అశోక్ కుమార్, ఎఎన్ఎం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ కృషి చేస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. కోపల్లె హైస్కూల్లో యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ మండల అధ్యక్షులు బి.రామాంజి కోటేశ్వరస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ పోరాటాల ద్వారా మాత్రమే అనుకున్నది సాధించగలమన్నారు. సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సంఘం ఇచ్చే పిలుపునకు అందరూ స్పందించి హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఎన్నికల అధికారి సిహెచ్ పట్టాభిరామయ్య, కె.సాయిరాం ఆధ్వర్యంలో యుటిఎఫ్ మండల శాఖ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా కె.సత్యనారాయణ, అధ్యక్షులుగా బి.రామాంజి కోటేశ్వర స్వామి, సహాధ్యక్షులుగా పి.ప్రభుదాస్, మహిళా సహాధ్యక్షురాలుగా డి.కనకదుర్గ, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర్రావు, కోశాధికారిగా వివిఆర్.రవికుమార్ రాజు, కార్యదర్శులుగా కె.రామ్మూర్తి రాజు, కె.అశోక్, సత్యబాబు, కిషోర్, కిషోర్ కుమార్, ఎం.శివాజీ, బి.అనూరాధ, పి.విష్ణుప్రసాద్, ఎస్‌వి.అప్పలనాయుడు, ఆర్ వెంకన్నబాబు, ఆడిటర్‌గా కెవి.అప్పల రాజు ఎన్నికయ్యారు. అనంతరం ఎస్ఎస్‌సి 2022లో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

వైద్య ఉద్యోగుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఆదివారం విజయవాడలో జరగనున్న వైద్య ఉద్యోగుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు నల్ల అప్పారావు అన్నారు. దీనిపై భీమవరంలో బుధవారం విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నల్లా అప్పారావు, సంఘం ప్రచార కార్యదర్శి జివివి.ప్రసాద్ మాట్లాడారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆస్కార్‌రావు నాయకత్వంలో ఆలిండియా నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు జి.సంజీవరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోవిందరావు, సంఘం ఉపాధ్యక్షులు పార్వతీశం, సంఘం భీమవరం జిల్లా ఉపాధ్యక్షులు కాపా నాగరాజు, సంఘం జిల్లా కోశాధికారి కె.అప్పారావు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమౌళి, బట్టు చంద్రశేఖర్, గోపాలకృష్ణ, భాస్కరరావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు సరికాదు

సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు సరికాదని, వారిని వెంటనే రెగ్యులరైజేషన్ చేసి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన అనంతరం దాదాపు 90 వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా వచ్చారని తెలిపారు. వారందరికీ అరకొర జీతాలే ఇస్తున్నారని తెలిపారు. వారిలో అధికంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందినవారే ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. దానికి భిన్నంగా పదేళ్లలోపు సర్వీసు ఉన్న అందరినీ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలుస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల వేల కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేస్తారని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలపై నీళ్లు చల్లేలా చర్యలు చేపట్టడం దారుణమని తెలిపారు. రెగ్యులరైజ్ చేస్తారనే నమ్మకంతో ఎన్నికల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ వైసిపికి ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించడం సిగ్గుచేటని తెలిపారు. ఉత్తర్వులు ఇచ్చి ఉంటే వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేసే ఆందోళనల్లో సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొని, వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బలరాం హెచ్చరించారు.

మాజీ సైనికుల సహాయార్థం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు మాజీ సైనికుల కుటుంబీకుల సహాయార్థం సాయుధ దళాల పతాక దినోత్సవం నిధికి విరాళాలు సేకరణ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని తాడేపల్లిగూడెం డివైఇఒ నిమ్మగడ్డ భారతీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డివైఇఒ మాట్లాడుతూ దేశం కోసం అహర్నిశలూ శ్రమించే సైనికులకు వారి కుటుంబాలకు నేరుగా సహకారం అందించడం ఈ పతాక దినోత్సవం రోజు మాత్రమే సాధ్యపడుతుందన్నారు. సాయుధ దళాల సహకారానికి విరాళాలు అందించాలని కోరారు. పాఠశాల ఎన్‌సిసి అధికారి కెవి.గణపతిరావు ఆధ్వర్యంలో 85 మంది ఎన్‌సిసి క్యాండెట్స్‌తో పట్టణంలో విరాళాలు సేకరించినట్లు ఆయన తెలిపారు. ఈ విరాళాల మొత్తం గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా జిల్లా సైనిక బోర్డు కార్యాలయం భీమవరం వారికి అందజేయడం జరుగుతుందని గణపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎంఎంవి ఎస్ఎల్.సుబ్బలక్ష్మి, పి.శివ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లక్ష్మీనగర్‌లోని ఆర్చిడ్స్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో త్రివిధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా బుధవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 సంవత్సరాలు ఆర్మీలో సేవలందించిన ఎస్.సాయికుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరం ఆర్మీ వారి వెల్ఫేర్ కోసం స్కూల్ యాజమాన్యం తరపున ఎం.జానకిరామ్, ఎం.శ్రీనివాస్ పది వేల రూపాయల విరాళం ఎంఇఒ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో సాయుధ దళాల పతాక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి వైవి జానకీరామ్ మాట్లాడారు. భారత సైన్యం, వైమానిక దళం, నావికా దళం దేశ సరిహద్దులను కాపాడటమే కాకుండా దేశంలోని అంతర్గతంగా జరిగే అనేక విపత్కర పరిస్థితులను చక్క దిద్దడంలో ముఖ్య పాత్ర పోషిస్తూ దేశ ప్రజలను రక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్, చంద్రకళ, త్రిమూర్తులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

హెచ్ఐవి రోగులకు పోషకాహారం అందజేత

ప్రజాశక్తి - తణుకురూరల్

ఇబ్బందుల్లో ఉన్నవారికి సాయపడాలని గౌతమీ సాల్వెంట్స్ ఆయిల్స్ అధినేత మల్లిన రామచంద్రరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే జరిగిన నేపథ్యంలో బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శివప్రసాద్, డిపిఎం డాక్టర్ శాంసన్ అధ్యక్షతన తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో హెచ్ఐవి సోకిన 35 మంది పిల్లలకు మల్లిన రామచంద్రరావు సహాయంతో సుమారు రెండు లక్షల రూపాలయతో సంవత్సరం పాటు పోషకాహారం అందేవిధంగా కిట్లు, ఎయిడ్స్ రోగులకు డాక్టర్ తాతిని రామబ్రహ్మం సహాయంతో ప్రోటీన్ డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా రామబ్రహ్మం మాట్లాడుతూ హెచ్ఐవి రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. రామచంద్రరావు పోషకాహారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎఇ ఫ్లోరెన్స్, షేర్ ఇండియా పిఒ జిఎన్ జగదీష్, జిల్లా డిస్-డిఎపిసియు ఎ.హరినాధ్‌కుమార్ పాల్గొన్నారు.


రోగులకు పోషకాహారం అందజేస్తున్న రాచంద్రరావు, రామబ్రహ్మం

15న చేనేత కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలో ప్రాథమిక చేనేత సహకార సంఘాల్లో చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని, కేంద్రం చేనేతపై విధించిన జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న భీమవరంలో చేనేత, జౌళి శాఖ జిల్లా కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. పట్టణంలోని సమతా భవనంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘ జిల్లా అధ్యక్షులు కాసా రత్నకుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా ఇటీవల చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు సమావేశం సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ చేనేతకు మరణ శాసనమైన జిఎస్‌టిని రద్దు చేయాలని, జిల్లాలో ప్రాథమిక చేనేత సహకార సంఘాలలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నేతల నేస్తం పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసా రామ్మోహనరావు, జిల్లా సహాయ కార్యదర్శి గుడిమెట్ల సుబ్బారావు, కమిటీ సభ్యులు వాసా రామలింగం, అక్కింశెట్టి కోటయ్య పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం

మొగల్తూరు: యువతను ప్రోత్సహిస్తూ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎంపిపి సత్తినేని మోహన్‌రావు అన్నారు. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో షష్టి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రథమ స్థానంలో కోమటితిప్ప కమిటీ జట్టు, ద్వితీయ స్థానంలో ఎల్‌బిచర్ల జట్టు, తృతీయ స్థానంలో బుట్టాయగూడెం జట్టు, నాలుగో స్థానంలో తాగినాడ జట్టు విజయం సాధించాయని ఛైర్మన్ కొల్లాటి రాంప్రసాద్ తెలిపారు. మొదటి బహుమతి రూ.40,000 మాజీ ఎంపిపి సత్తి మోహన్ రావు, ద్వితీయ బహుమతి రూ.30,000 జగన్నాధపురం సొసైటీ ఛైర్మన్ అల్లూరి రంగరాజు, కోమటి తిప్పనార్త్ సర్పంచి అల్లూరి శ్రీహరిరాజు, తృతీయ బహుమతి రూ.20,000 వైసిపి అధ్యక్షులు తీరుమని సుబ్బారావు, ఆంజనేయులు, భీమరాజు, నాలుగో బహుమతి కొప్పనాతి ధనమూర్తి, నాగరాజు, వెంకటేశ్వర్లు, అందించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి పులపర్తి సూర్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ పాల్గొన్నారు.

మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాలకోడేరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి సిహెచ్ వి.రంగమ నాయుడు కోరారు. ఐఎన్‌టిసి ఆధ్వర్యంలో 11న విజయవాడలో చేపట్టిన ఉద్యోగుల సర్వజన సభకు సంఘీభావంగా పాలకోడేరులో వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ స్వర్ణ నిరంజని, డాక్టర్ సుజన, ఆయుష్ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న పివిఎల్

పెన్నాడ గ్రామాభివృద్ధికి కృషి

డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పెన్నాడలో రెండో రోజు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పివిఎల్ మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను దఫదఫాలుగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధికే వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బిసిల అభ్యున్నతికి చేపట్టిన జయహో బిసి గర్జన ఎంతో విజయవంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), గ్రామ సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ, ఉప ఎంపిపిలు ఆదాడ లక్ష్మీతులసి, నరేష్, వైసిపి ముఖ్య నాయకులు గోపాలకృష్ణరాజు, వంశీకృష్ణంరాజు, శ్రీనివాసరాజు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాబృందం ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుగొండ

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు గాను బస్టాండ్ ఆవరణలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కళాజాత కెవైఎస్ఎస్ ఎన్‌జిఒ ఆధ్వర్యంలో బుధవారం మిరియాల సత్యనారాయణ కళాబృందం ప్రదర్శన చేశారు. ఎయిడ్స్, టిబి తదితర ప్రాణాంతక వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంఒ ఆర్‌డబ్ల్యు గౌరీ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల ప్రేమతో మెలగాలి

ఎంఇఒ ఎస్‌కెవి.ప్రేమజ్యోతి

ప్రజాశక్తి - పోడూరు

వికలాంగుల పట్ల చులకన భావం మాని ప్రేమ చూపాలని మండల విద్యాశాఖాధికారి ఎస్‌కెవి.ప్రేమజ్యోతి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని బుధవారం ఎంఇఒ ప్రేమజ్యోతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ వికలాంగులను ఆదరించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఎంఇఒ వికలాంగ విద్యార్థులకు పండ్లు అందజేశారు. అలాగే ఎంపిక చేసిన వికలాంగ విద్యార్థులకు వీల్ ఛైర్, రోలేటర్, ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. అందరు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, ఎంపిటిసి పోడూరి నాగరాజు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ వద్ద అన్నదానం

అత్తిలి : అన్నా క్యాంటీన్‌ను జగన్మోహన్ రెడ్డి నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ పేదలకు ఉచితంగా రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ అన్నారు. అత్తిలిలో బుధవారం 86వ రోజు దాత సహకారంతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ జగన్ పాలన ఆరంభం నుంచి అన్నా క్యాంటీన్ మూతవేశారని తెలిపారు. దాతలు, వివాహ శుభకార్యాలు చేసుకున్న వారు, ప్రముఖుల విరాళాల ద్వారా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి.చంటి, శ్రీను, దాసం బాబ్జి, తసగాని హనుమంతు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పూర్ణ బాబ్జి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. లేనిపక్షంలో తగిన సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభ ప్రతినిధిగా రాణి

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకూ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభకు ఆర్.రాణి ప్రతినిధిగా ఇటీవల జరిగిన జిల్లా కమిటీ సమావేశాల్లో ఎన్నికైనట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.నరసింహ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల జేశారు. భారత దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి సుమారు 500 మంది విద్యార్థి సంఘం నాయకులు ఈ సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలు రూపొందిస్తారని తెలిపారు. 13న హైదరాబాద్‌లో జరగనున్న బహిరంగ సభలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డాక్యుమెంటు పోయినది

పడాల సూర్యవర్ధిని, భర్త: వీరెడ్డి అను నేను పెంటపాడులోని సైటు వద్ద నుండి జిరాక్సు సెంటరుకు వెళ్ళు చుండగా325/2004 నెంబరు గల డాక్యుమెంటు పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

సెల్: 91210 57993

ప్రకటన

మహారాజశ్రీ ఏలూరు ఫ్యామిలీ కోర్టు 7వ అదనపు జిల్లా కోర్టులో

EP No.148/2020 A.C.No.126/2015

Between:
M/s.Shriram Transport Finance Company Ltd., Tadepalligudem Rep. by GPA Holder DV BTS Narayana: ...DHR
And
Marla Nagamani and others ...JDR's

J.D.R-3:
శ్రీ మార్ల ఆదినారాయణ
తండ్రి: సత్యం, డోర్ నెం.4-44-6/2, శ్రీరామ్‌నగర్, డి.యస్.ట్యాంక్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.

వాయిదా తేది: 28-12-2022

ఈ నెంబరు EPలో 3వ JDR కి Order 21 Rule-66 of CPC నోటీసు కోర్టు ద్వారా, పోస్ట్ ద్వారా పంపినసూ తీసుకోకుండా Avoid చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పై నెంబరు EPలో 3వ JDR అయిన మీరు శ్రీ కోర్టు వారి ఎదుట ది.**28-12-2022** తేదీన ఉదయం గం॥10.30 ని॥లకు మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియ జేయడమైనది.

K.V.S.N.R. గోపాల్
ఏలూరు — **అడ్వకేట్**, ఏలూరు
ది.5-12-2022 — సెల్: 99498 85456

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 19/2020

Between:
Vuddandravu Mulaswamy -వాది
AND

D-1: Sheik Noorbi, W/o. late Sheik Basha Saheb, C/o. Sheik Mohammed basha, Muslim, aged 60 yrs, House wife, R/o. D.No. 4-320, Christian peta, Vissakoderu, Near Gopi Krishna Centre, Bhimavaram - 534201, West Godavari Dist.,

D-2: Sheik Rushdiya Ritvana, D/o. late Sheik Basha Saheb, C/o. Sheik Mohammed Basha, Muslim, aged 40 yrs, R/o. D.No. 4-320, Christian peta, Vissakoderu, Near Gopi Krishna Centre, Bhimavaram - 534201, West Godavari Dist.,

D-3: Sheik Harseen, D/o. late Sheik Basha Saheb, C/o. Sheik Mohammed basha, Muslim, aged 38 yrs, R/o. D.No. 4-320, Christian peta, Vissakoderu, Near Gopi Krishna Centre, Bhimavaram - 534201, West Godavari Dist.,

-ప్రతివాదులు

పై నంబరు దావాలో ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 19-12-2022 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎ.వి.ఎన్.ఎస్.రామచంద్రరావు
రాజమండ్రి — అడ్వకేటు, రాజమండ్రి
07-12-22 — సెల్: 9966681588